పోలియోను తరిమి కొట్టాలి

● రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ● పుప్పాలగూడలో ప్రారంభం


పుప్పాలగూడలో చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శశాంక

మణికొండ: పోలియో మహమ్మారిని దేశం నుంచి తరమికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశంలో పోలియో కేసులు లేవని, ఇతర దేశాల్లో మాత్రం కనిపిస్తున్నాయని, ఆ మహమ్మారిని మన దేశంలోకి రానివ్వకుండా ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలియో పరిశీలకురాలు సుమిత్ర, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఉప వైద్యాధికారి సృజన, జిల్లా పరిశీలకులు స్వర్ణకుమారి, రాకేశ్, గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్, మండల వైద్యాధికారి పద్మ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గండిపేట మండలవ్యాప్తంగా 53 కేంద్రాల్లో చిన్నారలకు పోలియో చుక్కలు వేశారు.

ఉడంగడ్డలో..

మైలార్‌దేవ్‌పల్లి: ఉడంగడ్డలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు అబ్బెశి సదాలక్ష్మి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. 0-5 ఏళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. డివిజన్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ నిర్వహించారు.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలతో కలిపి 77 బూత్‌ల్లో 37,718 మంది చిన్నారులు ఉండగా 36,209 మందికి పోలియో చుక్కలు వేసినట్లు ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రేఖ తెలిపారు. రెండు చుక్కలతో చిన్నారుల జీవితంలో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు. ఆరాంఘర్ బస్టాప్‌లో ప్రయాణికుల పిల్లల కోసం బూత్‌ను ఏర్పాటు చేశామని, అలాగే రెండు మొబైల్ టీంలను కూడా ఏర్పాటు చేసి చిన్నారులకు చుక్కలు వేసినట్లు పేర్కొన్నారు. సోమవారం ,మంగళవారం ఇంటింటికీ వెళ్లి మిగితా 1507 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీదేవి, స్వాతి, కమ్యూనిటీ మెడికల్ అధికారి సిరాజుద్దీన్, మెడికల్ అధికారి కేశవులు, సూపర్‌వైజర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కల మందుకు చక్కటి స్పందన

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో, కాలనీల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. సన్‌సిటీ పీఎన్‌టీ కాలనీలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమానికి కార్పొరేటర్ పద్మావతీపాపయ్యయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఆమె మాట్లాడుతూ అంగవైకల్యం నుంచి పిల్లలను కాపాడుకునేందుక తల్లిదండ్రులు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పిల్లలకు వచ్చే వ్యాధుల్లో పోలియో ఒకటని, ఇది వస్తే పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి కాళ్లు, చేతులు వంకర అవుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యురాలు సురేఖ

అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో ..

అత్తాపూర్: హైదర్‌గూడలో అత్తాపూర్ కార్పొరేటర్ ఎం.సంగీత గౌరీ శంకర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజా, ఆశ వర్కర్లు జయశ్రీ, ఆర్‌పీ రాణి, బీజేపీ అత్తాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రావుల జగన్, ఎస్.శ్రీశైలం, కొంగల బుచ్చయ్య పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మొత్తం 36,209 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలో మొత్తం 77 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.


పీఎన్‌టీ కాలనీలో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ పద్మావతి


బాలాజీనగర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది


పోలియో చుక్కలు వేయించేందుకు క్యూలో నిల్చున్న తల్లిదండ్రులు

మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన


వైద్య శిబిరానికి తరలివచ్చిన స్థానికులు

మణికొండ: మణికొండ వీఆర్ ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్, పలు ఆసుపత్రుల ఆధ్వర్యంలో అలకాపూర్ టౌన్‌షిప్‌లోని నేతాజీ పార్కులో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన క్యాంపు మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. ఇందులో మెడికేర్, ఫస్ట్ కేర్, శ్రీరాం ఆర్థో క్లీనిక్స్, అక్షయ దంత వైద్యశాలల డాక్టర్లు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ నిర్మల్, ఎండీ లక్ష్మణ్‌రావు, కోశాధికారి దిలీప్ కక్కడ్, కౌన్సిలర్లు ఎ.నవీన్‌కుమార్, బి.పద్మారావుతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


కరాటే పోటీలను ప్రారంభిస్తున్న జైపాల్‌రెడ్డి

మణికొండ: కరాటే ఆత్మరక్షణకు తోడ్పడుతుందని కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యుడు ముంగి జైపాల్‌రెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేటలో రాష్ట్ర స్థాయి నాలుగో సక్సెస్ షోటాకాన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోకాపేటలో రాష్ట్ర స్థాయి పోటీలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. పిల్లలకు వారికి నచ్చిన క్రీడలో తర్ఫీదు ఇచ్చి చదువుతో పాటు అందులోనూ రాణించేలా తీర్చి దిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. చాంపియన్ షిప్ ఆర్గనైజర్ కె. రాజు మాట్లాడుతూ కరాటే నేర్చుకునేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారని, వారిని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చి దిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ విజయ్‌బాబు, కౌన్సిలర్ దుర్గేశ్‌యాదవ్, నాయకులు యాదగిరి పాల్గొన్నారు.

మణికొండలో ట్రాఫిక్ మళ్లింపు

మణికొండ: మణికొండ మై పెట్రోల్ పంపు నుంచి అంజలి గార్డన్ మీదుగా ల్యాంకోహిల్స్ జీ సర్కిల్ వరకు డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఆ రోడ్డును మూసి వేస్తున్నామని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నార్సింగి నుంచి వచ్చి ల్యాంకోహిల్స్ వైపు వెళ్లే వారు బీఆర్‌సీ అపార్ట్‌మెంట్స్ పక్కన కొత్త రోడ్డు ద్వారా వెళ్లాలని, షేక్‌పేట వైపు నుంచి వచ్చే వారు యూనియన్ బ్యాంక్ చౌరస్తా నుంచి మర్రిచెట్టు రోడ్డు గుండా వెళ్లాలని సూచించారు. అంజలిగార్డన్ కాలనీ, డైమండ్ హిల్స్ వాసులు వారికి అనుకూల రోడ్లను చూసుకొని ప్రయాణించాలని ఆయన కోరారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 4న (నేడు) ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నటుల ఉప కమిషనర్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లకు చెందిన ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయాలని కోరారు. సంబంధిత అధికారులు సిబ్బంది క్షేత్రస్థాయిలో సందర్శించి తగు చర్యలు చేపడతారని వెల్లడించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

రాజేంద్రనగర్: ఇ.ఎస్.కె.ఆర్.టోర్నమెంట్ సీజన్ 12 గోల్డ్ కప్ ఫైనల్‌లో రాజేంద్రనగర్ డైరీ ఫార్మ్ ఎస్ఎస్‌వైసీ క్రికెట్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఆదివారం గ్రౌండ్‌లో నిర్వహించిన ఫైనల్‌లో మొదట బ్యాటింగ్ చేసిన క్రీడం జట్టు 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాజేంద్రనగర్ టీమ్ 180 పరుగులకే ఆలౌట్ అయ్యింది.

వేము వందనంకు డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న వేము వందనం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ భవానీకాలనీకి చెందిన రచయిత, నటుడు, దర్శకుడు వేము సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాహితీ రత్న వేము వందనంకు ఆదివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. రవీంద్రభారతీలో పద్మభూషణ్ గుర్రం జాషువా 136వ జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన జాషువా స్మారక కలా పరిషత్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పెద్దేటి యోహన్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లో వేము వందనం మాట్లాడుతూ.. సాహితీ, సాంస్కృతిక సేవా, కళా రంగాలలో 45 ఏళ్లుగా తాను చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్‌ను అందించడం ఆనందంగా ఉందన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి


సయ్యద్ సిరాజ్ మృతదేహం

రాజేంద్రనగర్: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హైదర్‌గూడ పెద్ద తాళ్లకుంట పార్కులో ఓ యువకుడు మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు ఆదివారం సాయంత్రం సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి జేబులో పరిశీలించగా ఆధార్ కార్డుతో పాటు వాహన ఆర్సీ లభించింది. ఇందులో సయ్యద్ సిరాజ్ (40) చింతల్‌మేట్ అని చిరునామా ఉంది. దీంతో పోలీసులు కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం పెట్రోలింగ్ పోలీసులను పంపించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాబోయే రోజులు బీజేపీవే

● రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్
● బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి 150 మంది చేరిక

మణికొండ: రాష్ట్రంలో రాబోయే రోజులు బీజేపీవేనని, పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు కృషి చేయాలని ఈ పార్టీ రాష్ట్ర చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సూచించారు. నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 150 మంది నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆయన నివాసంలో తన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎంపీ ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించి సత్తా చాటుతామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఈటెల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన ఖానాపూర్ యువకులు, నాయకులు

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని హరిహర క్షేత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న మహా శివరాత్రి ఏర్పాట్లపై ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు, ఆలయాన్ని అలంకరణ చేస్తామన్నారు.అలాగే మరుసటి రోజు 9వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మహాప్రసాదం భక్తులకు అందించనున్నట్లు తెలిపారు. శివరాత్రి రోజు ఉపవాసం ఉన్న భక్తులకు మొదటిసారి అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, ఆలయ పూజారి అనంతచారి, డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు, వై.గోపాల్, కె.వి.రమణ, ఇ.వేణుగోపాల్, పి.మురళీకృష్ణ, ఎం.ప్రసాద్, ఎ.శ్యాంరావు, డి.కిరణ్, కె.సతీశ్ పాల్గొన్నారు.


శివరాత్రి ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

మేధాశక్తి పెంపునకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదం


ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడు బీరప్ప

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించేందుకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో దోహదపడుతాయని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు బీరప్ప పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఎస్‌హెచ్ పాఠశాలలో ఆదివారం చిన్నారులతో వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. దేశంలోని వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించిన అంశాలపై తయారు చేసిన పరికరాల నమూనాలు ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. ఉత్తమ నమూనాలు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి మల్లెల శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రనగర్ మండలాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ బాబురావు తదితరులు ఉన్నారు.

ఆస్తిపన్ను పరిష్కార వేదిక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆస్తిపన్ను పరిష్కార వేదికను నిర్వహించినట్లు ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి కార్యక్రమం చేపట్టగా 5 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. ఎక్కువగా ఆస్తిపన్ను వస్తున్నదని నలుగురు, మరొకరు పేరు మార్పు కోసం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నాలుగు ఫిర్యాదులను సంబంధిత బిల్లు కలెక్టర్లకు అందించామని వారు ఫిర్యాదుదారుడి ఇంటి వద్దకు వెళ్లి పూర్తి వివరాలు సేకరించి ఆస్తి పన్నును పరిశీలిస్తారన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఇంటి యజమానులు తమ ఆస్తిపన్నులకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులు ఉన్న ఈ పరిష్కార వేదికకు హాజరై పరిష్కరించుకోవాలని సూచించారు.


ఆస్తిపన్ను పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్న ఫిర్యాదుదారు

ఆశ్రమానికి అనాథ వృద్ధుడు

రాజేంద్రనగర్: కొన్ని రోజులుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన గేట్ ఎదుట ఉన్న జాతీయ రహదారిపై బ్రిడ్జి కింద ఓ వృద్ధుడు 20 రోజులుగా ఉంటున్నాడు. దీనిని గమనించిన ఎడ్లకాడి సూర్యం, ఉపేందర్ వృద్ధుడి వద్దకు వెళ్లి పరామర్శించారు. అతని కుడి కాలు విరిగి ఉండడంతో పాటు కాలుకి పురుగులు పట్టి ఉన్నాయి. దీంతో ఈ విషయాన్ని రగడంపల్లి శ్రావణ్‌కు తెలపగా అతను ఫోన్లో స్ట్రీట్ లైట్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శేఖర్‌కు సమాచారం ఇచ్చారు. వారు ఆదివారం మధ్యాహ్నం వచ్చి అనాథ వ్యక్తిని తీసుకెళ్లారు. చికిత్స అందించి సంస్థలోనే ఉంచుకుంటామని వారు తెలిపారు. ఆయనను తరలించడానికి సహకరించిన వారిలో పెండ్యాల సాయి మాలిక్, మలాకి, గోల్కొండ ఉపేందర్, రాజేంద్రనగర్ సిబ్బంది ఉన్నారు.


అనాథ వ్యక్తిని ఆశ్రమానికి తరలించిన రగడంపల్లి శ్రావణ్, ఎడ్లకాడి సూర్యం

అర్ధరాత్రి దాటినా.. ఓపెనే!

● రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వ్యాపారుల ఇష్టారాజ్యం
● నిబంధనలు పాటించని కొందరు హోటళ్లు, షాపుల యజమానులు
● తరచూ ట్రాఫిక్ జాం, శాంతి భద్రతలకు విఘాతం
● పట్టించుకోవాలని స్థానికుల విన్నపం


శనివారం రాత్రి పిస్తాహౌస్‌లో సిబ్బందితో గొడవ పడుతున్న యువకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలు హోటళ్లు, వ్యాపార కేంద్రాలు, పాన్ షాపులను అర్ధరాత్రి 2-3 గంటల వరకు కూడా మూసి వేయకపోవడంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నది. వీటిని నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో సమస్య రోజురోజుకూ జఠిలమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారులపై ఈ హోటళ్లు, వ్యాపార కేంద్రాలు, పాన్ షాపులు ఉండడంతో తరుచూ ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. ఏదైన సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే స్పందిస్తున్న పోలీసులు అనంతరం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్, రాజేంద్రనగర్ డివిజన్లలో దాదాపు 300 లకు పైగా హోటళ్లు ఉన్నాయి. వీటిని రాత్రి 11 గంటల్లోపు మూసివేయాలి. అయితే ఇందులో ప్రధానంగా 18 హోటళ్లు అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయి. బండ్లగూడ చౌరస్తా నుంచి దుర్గానగర్ మీదుగా గగన్‌పహాడ్ వరకు, గగన్‌పహాడ్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా మీదుగా అత్తాపూర్ వరకు జాతీయ రహదారితో పాటు స్థానిక ప్రాంత వాసులకు ప్రధాన రహదారి కావడంతో ఎప్పుడూ బిజీగా ఉంటుంది. ఈ రహదారులకిరువైపులా బడా హోటళ్లు అర్ధరాత్రి వరకు ఓపెన్ చేసి ఉండడంతో యువకులు ఇక్కడికి తరలివస్తున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలను రోడ్లపైనే పార్కు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆరాంఘర్ చౌరస్తాలోని పిస్తాహౌజ్ హోటల్ వద్ద రాత్రి 11 గంటల ప్రాంతంలో వాహనాలను ఇష్టానుసారంగా నిలపడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. వాహనాలను తొలగించాలని సెక్యూరిటీ గార్డుకు సూచించినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. అలాగే అత్తాపూర్‌లోని ఓ హోటల్ సబ్ రోడ్డుతో పాటు ప్రధాన రహదారిని పార్కింగ్‌గా కొనసాగిస్తున్నాడు. దీంతో ఈ ప్రాంతంలో సైతం ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. అత్తాపూర్‌లోని పిస్తాహౌస్‌కు శనివారం రాత్రి 12:30 గంటల ప్రాంతంలో కొందరు యువకులు భోజనానికి వచ్చి సిబ్బందితో ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో అక్కడే కొందరు భోజనం చేస్తుండడంతో వారికి సైతం గాయాలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు హోటళ్లపై నిఘా పెట్టి సమయ పాలన పాటించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా మల్లన్న కల్యాణం

●ప్రత్యేక పూజా కార్యక్రమాలు ●పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మున్సిపల్ చైర్మన్


కేదర్‌నాథ్ ఆలయంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


మణికొండ మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మణికొండ మల్లన్న స్వామి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు కొట్నం, 11:32 మల్లన్న స్వామి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సదర్‌పటం, గొలుసులు తెంపడం, అగ్నిగుండాలు తొక్కడం కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం 5 గంటలకు ఎల్లమ్మ బోనాలు, రాత్రి 9 గంటలకు ఒగ్గుకథలు నిర్వహించారు. అంతకుముందు ఉదయం గ్రామం నుంచి మహిళలు గంపలతో ఆలయానికి చేరుకుని అక్కడే బోనాలు సిద్ధం చేశారు. స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, ఆలయ కమిటీ చైర్మన్ బి. జైహింద్‌రావు, అధ్యక్షుడు బి.ముత్యాలు, ప్రధాన కార్యదర్శి డి. లక్ష్మణ్‌తో పాటు స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, కురుమ సంఘం నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లింగేశ్వర స్వామి కల్యాణం..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధి పద్మశాలీపురంలోని కేదర్‌నాథ్ లింగేశ్వర స్వామి కల్యాణమహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్‌గౌడ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..వచ్చే మహాశివరాత్రి పండుగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఉపవాసంతో వచ్చే భక్తులకు ఆలయంలో వసతులు కల్పించాలని ఆలయ కమిటీకి సూచించారు. కార్యక్రమంలో కాశిగారి యాదగిరి ,యంజాల మహేశ్ రాజ్ , యంజాల శేఖర్, మునగపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్


మల్లన్న స్వామిని దర్శించుకున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి